## అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కడమంచి అర్జున్

**ఆర్మూర్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కామారెడ్డి జిల్లా ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కడమంచి అర్జున్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర స్థాయి పదవుల కోసం ఎన్నికలు నిర్వహించగా, కడమంచి అర్జున్‌కు సంయుక్త కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఐకానిక్ స్టార్ అల్లు అర్జున్, నిర్మాత బన్నీ వాసు కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం కడమంచి అర్జున్ అభిమానులకు, నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## భార్యను హత్య చేసిన భర్త

**ఆర్మూర్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

ఆర్మూర్ పట్టణంలోని యోగేశ్వర్ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య జరిగిన వివాదం కత్తిపోట్లకు దారితీసింది. స్థానికుల సమాచారం ప్రకారం, భార్య ఒక వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగిస్తోందని అనుమానించిన భర్త తరచూ వాగ్వాదం జరుపుతున్నాడు. పిల్లలను చూడనివ్వడం లేదని, ఇంటికి రావద్దని భార్య తీర్మానాలు చేయించుకోవడంతో భర్త తీవ్ర ఆగ్రహానికి గురై ఆమెపై దాడి చేశాడు. ఆగ్రహావేశంలో భార్య మెడపై కత్తితో దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే రక్తస్రావంతో కుప్పకూలింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భర్తను అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## టపాకాయల విక్రయానికి ముందుగా అనుమతి తప్పనిసరి

**ఆర్మూర్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేయాలనుకునేవారు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్, సంబంధిత అధికారుల నుండి అనుమతి తీసుకోవాలని ఆర్మూర్ పోలీస్ స్టేషన్ సీఐ పి. సత్యనారాయణ తెలిపారు. అనుమతి లేకుండా దుకాణాలు నిర్వహించిన వారిపై ఎక్స్‌ప్లోజివ్స్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టపాకాయల స్టాళ్లు ఖాళీ ప్రదేశాల్లో, నివాస ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి దుకాణంలో అగ్నిభద్రత చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని, ఈ సూచనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.



## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**నిజామాబాద్ రూరల్, ధర్పల్లి, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ధర్పల్లి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్సై కళ్యాణి విద్యార్థులను స్వాగతించి, దేశ సేవలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించారు. అనంతరం స్టేషన్‌లోని రిసెప్షన్, లాక్‌అప్, రికార్డులు, క్రైమ్ సెక్షన్ వంటి విభాగాలను పరిచయం చేస్తూ వాటి పనితీరును వివరించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఎస్సై కళ్యాణి సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చట్టం పట్ల గౌరవం పెంపొందించడంతో పాటు పోలీస్ శాఖ కార్యకలాపాలపై అవగాహన కలిగిందని తెలిపారు.



## 49 మద్యం షాపులకు 193 దరఖాస్తులు

**కామారెడ్డి, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

జిల్లాలో 49 మద్యం షాపుల కోసం ఇప్పటివరకూ 193 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్ రావు తెలిపారు. దరఖాస్తులను స్టేషన్ల వారీగా పరిశీలించినప్పుడు కామారెడ్డి స్టేషన్ పరిధిలో 15 వైన్ షాపులకు 54, దోమకొండ స్టేషన్ పరిధిలో 8 షాపులకు 32, ఎల్లారెడ్డి పరిధిలో 7 షాపులకు 25, బాన్సువాడ పరిధిలో 9 షాపులకు 44, బిచ్కుంద పరిధిలో 10 షాపులకు 38 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 18వ తేదీ వరకు అవకాశం ఉన్నందున, ఆసక్తి గల దరఖాస్తుదారులను త్వరితంగా దరఖాస్తు చేయమని ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్ రావు విజ్ఞప్తి చేశారు.



## జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

**ఆర్మూర్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

ఆర్మూర్ పట్టణంలో జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ ప్రెస్ క్లబ్, నవనాథపురం ప్రెస్ క్లబ్‌లు డిమాండ్ చేశాయి. మంగళవారం ఆర్మూర్ పోలీస్ స్టేషన్ లో సీఐ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల పట్ల పోలీస్ సిబ్బంది దురుసు ప్రవర్తన అసహ్యకరమని, కానిస్టేబుళ్లు దినేష్, అశోక్‌లు కావాలనే అవహేళనాత్మకంగా ప్రవర్తిస్తూ ప్రెస్ క్లబ్ సభ్యుల వాహనాలకు అనవసరంగా జరిమానాలు వేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టే పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చౌల్ సందీప్, నవనాథపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సంజీవ్ పార్దెం, గౌరవాధ్యక్షుడు పద్మారావు, సీనియర్ జర్నలిస్టులు సాత్పూతే శ్రీనివాస్, రాజేశ్వర్ గౌడ్, పుట్టి మురళి, నరేందర్ మనోహర్, క్రాంతికుమార్, చరణ్ గౌడ్, మహిపాల్, గణేష్, సురేందర్ గౌడ్, గణేష్ గౌడ్, వెంకట్, జానా రమేష్, మహేష్, వినోద్, అరుణ్, శ్రవణ్, కేతన్, చిరంజీవి, సురేష్, సురేష్ బాబు, చేతన్, కిరణ్, యఫై, రితీష్, రాకేష్, వెంకటేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం

**ఆర్మూర్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

ఆర్మూర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పట్టణ అధ్యక్షుడు మందుల బాలు అధ్యక్షత వహించారు. సమావేశంలో నూతన మోర్చాల అధ్యక్షుల నియామక పత్రాలను అందజేశారు. బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా ఉదయ్ గౌడ్, దళిత మోర్చా అధ్యక్షుడిగా గుండేటి రాజశేఖర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా శేషగిరి లింగం నియమితులయ్యారు. నియామక పత్రాలను పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, జిల్లా ఉపాధ్యక్షుడు పాలెపు రాజు, జిల్లా కార్యదర్శి పోల్కం వేణు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, సీనియర్ నాయకుడు నూతల శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షులు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, ఎంపీ అరవింద్, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారికు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో విజయాన్ని సాధించేందుకు కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆకుల శీను, జెస్సు అనిల్, కలిగోట గంగాధర్, బద్రి, ఆకుల రాజు, ప్రధాన కార్యదర్శి గుగులోత్ తిరుపతి నాయక్, ఉపాధ్యక్షుడు బాండ్లపల్లి నర్సారెడ్డి, పులి యుగంధర్, కార్యదర్శి కుమార్, పోచంపాటి శీను, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సమగ్ర సీపీఆర్ పై అవగాహన శిక్షణ కార్యక్రమం

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

నిజామాబాద్ లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సమగ్ర సీపీఆర్ పై అవగాహన మరియు ప్రాక్టికల్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఈనెల 13–17 తేదీలలో జరుపుకుంటున్న కార్డియో–పల్మనరీ రీసస్సిటేషన్ (సీపీఆర్) అవగాహన వారోత్సవం లో భాగంగా, నర్సింగ్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి ప్రత్యేకంగా నిర్వహించబడింది. కార్యక్రమంలో డా. జలగం తిరుపతి రావు, హెచ్‌ఓడి అండ్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జనరల్ మెడిసిన్ మార్గదర్శకత్వం అందించారు. డా. శివకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ మరియు డా. ప్రత్యూష, అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ యానస్థీషియాలజీ వివిధ డెమోలను నిర్వహించారు. కార్యక్రమంలో డా. పి. శ్రీనివాస్, సూపరింటెండెంట్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, నిజామాబాద్, డా. విజయ్ కుమార్, హెచ్‌ఓడి అండ్ ప్రొఫెసర్, జనరల్ సర్జరీ డిపార్ట్‌మెంట్, అలాగే చంద్రకళ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–I పాల్గొన్నారు. మొత్తం 180 మందికి పైగా పాల్గొని సీపీఆర్ పద్ధతులపై అవగాహన పొందారు.




# రోడ్డుపై డ్రైనేజీ నీరు

**ఆర్మూర్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**



ఆర్మూర్ పట్టణంలోని 10వ వార్డులో రాజా రాంనగర్, టీచర్స్ కాలనీ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాల వెనుక రోడ్డుపై డ్రైనేజీ నీరు చేరి రహదారి బురదమయంగా మారింది. రహదారిపై వాహనాలు వెళ్లడం కష్టమైపోగా, నడిచే ప్రజలు జారి పడే ప్రమాదం నెలకొంది. ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ నీటిని రోడ్డుకే వదులుతున్నారని, దీనివల్ల కాలనీ వాసులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నివాసులు తెలిపారు. స్కూల్‌కు వెళ్లే చిన్నపిల్లలు ప్రతిరోజూ ఈ రహదారిలోనే వెళ్లాల్సి వస్తోందని, దాంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కాలనీలో లేఅవుట్ లేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు జరుగుతున్నాయని, మున్సిపల్ అధికారులు దీనిపై చర్యలు తీసుకోవడం లేదని నివాసులు ఆరోపించారు. ఈ సమస్యను గమనించిన సిపిఎం నాయకుడు కుతాడి ఎల్లయ్య వెంటనే అక్కడికి వెళ్లి కాలనీ వాసులతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. డ్రైనేజీ నీరు రోడ్డుపైకి రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆయన డిమాండ్ చేశారు. మాజీ కౌన్సిలర్ మురళీధర్ కూడా అక్కడికి చేరుకొని అధికారులకు పరిస్థితిని వివరించారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఎల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై స్పందించాల్సిన సమయంలో ఫోన్‌కు సమాధానం ఇవ్వకపోవడం వివక్ష ధోరణిగా అభివర్ణించారు. తదుపరి చర్చల అనంతరం అధికారులు సాయంత్రం మూడుగంటలలోపు పనులు చేపడతామని హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఇకపై డ్రైనేజీ నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త పేరుకుపోకుండా మున్సిపల్ సిబ్బంది క్రమం తప్పకుండా శుభ్రపరిచేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- **పాఠశాలలు, ఏటీసీలు పరిశీలన**

**సిరికొండ, నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**



సిరికొండ, భీంగల్, కమ్మర్పల్లి మండలాల్లో మంగళవారం జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీలు) సందర్శించి వసతి సదుపాయాలు, భౌతిక వసతులను పరిశీలించారు. సిరికొండ మండలం చిమన్‌పల్లి గ్రామంలోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో తరగతి గదులు, డార్మిటరీ, వంటగది, టాయిలెట్లు పరిశీలించి, కిచెన్, టాయిలెట్ల అపరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా, నిర్వహణను తక్షణం మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అదే ప్రాంగణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అవసరమైన వసతులపై తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అనుసరించి పౌష్టికాహార భోజనం అందించాలనూ కలెక్టర్ సూచించారు. అనంతరం కమ్మర్పల్లి మండలం బషీరాబాద్, భీంగల్ మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన ఏటీసీ కేంద్రాలను పరిశీలించి, అందుబాటులో ఉన్న సదుపాయాలను సమీక్షించారు. భీంగల్ ఏటీసీ తుది దశలో ఉన్న నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని, కోర్సుల్లో పూర్తి స్థాయిలో అభ్యర్థులు ప్రవేశాలు పొందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తనిఖీల సమయంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు కలెక్టర్‌తో పాల్గొన్నారు.

# భూ భారతి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి



- **కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

భూ భారతి పెండింగ్ దరఖాస్తులను వారం రోజులలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మహమ్మద్ నగర్, బిచ్కుంద, గాంధారి, లింగంపేట మండలాల తహసిల్దార్లతో సమావేశం నిర్వహించి దరఖాస్తుల ప్రగతిపై సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ప్రజల భూ సమస్యను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టినట్లు, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత రైతులకు న్యాయం చేయడం అధికారుల బాధ్యతలో ఉందని తెలిపారు. తహసిల్దార్లను వెంటనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, మీ మండలాల్లో ఉన్న భూభారతి దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన వారం రోజుల్లో పరిష్కరించాలన్నారు. దరఖాస్తుల పరిష్కారం వేగవంతంగా జరిగేలా జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్ మరియు సంబంధిత ఆర్డీవోలను ప్రత్యేకంగా పర్యవేక్షించమని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, ఎల్లారెడ్డి ఆర్డీఓ పార్థసింహారెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, కలెక్టరేట్ ఏవో, కలెక్టరేట్ సూపరెంటిండెంట్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

**కామారెడ్డి, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

కామారెడ్డిలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ మంగళవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమయ్యేలా ఆదేశించారు. ప్రత్యేకంగా బాన్సువాడ మండలంలో 446 మంజూరైన ఇండ్లలో కేవలం 169 మాత్రమే ప్రారంభమైనందున, మిగిలిన 227 ఇండ్ల నిర్మాణానికి వెంటనే మార్కౌట్ ఇవ్వి పనులను ప్రారంభించమని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా బేస్మెంట్ స్థాయికి పూర్తయిన 73 ఇండ్లు, రూమ్ లెవెల్ వరకు పూర్తయిన 22 ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయమని పిడి హౌసింగ్ విజయ్ పాల్ రెడ్డిని ప్రత్యేకంగా ఆదేశించారు. సమావేశంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ నాయక్, డిపిఓ మురళి, బాన్సువాడ మండల హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ ఏఎన్ఎం పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**చేగుంట, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

మెదక్ జిల్లా, చేగుంట పరిధిలోని మోడల్ హాస్టల్ మరియు వడియారం హాస్టల్లో ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని హాస్టల్ ఇంచార్జ్ శ్రీవాని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన సంబంధిత విద్యా అర్హత ఉన్న అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుల చివరి తేదీ ఈ నెల 20వ తేదీ అని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు, వివరాల కోసం 7660931789, 6300981605 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అవగాహన

**నిజామాబాద్ రూరల్, ఢిచ్ పల్లి, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డిచ్పల్లి మోడల్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్, ఎస్సై షరీఫ్ విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, ట్రాఫిక్ నియమాలపై సూచనలు అందించారు. తెలియని లింకులు, ఓటిపీలు ఎవరికీ చెప్పకూడదని, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని అధికారులు తెలిపారు. అలాగే, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మైనర్లు డ్రైవ్ చేయకూడదని హెచ్చరించారు. దీపావళి సందర్భంగా ప్రతి విద్యార్థి తన తండ్రి లేదా అన్నకు హెల్మెట్ బహుమతిగా ఇవ్వాలని సలహా ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పోలీస్ వ్యవస్థపై అవగాహన

**సిరికొండ, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్‌లోని విభాగాలు, ఉపయోగించే పరికరాలను విద్యార్థులకు చూపించారు. లాటి, పిస్టల్, బుల్లెట్, ఖైదీలకు వేసే బేడీలు మొదలైన పరికరాల ఉపయోగం, వాటి ప్రాముఖ్యతను ఎస్ఐ రామకృష్ణ వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. పోలీసులు 24 గంటలు ప్రజల సేవలో ఉంటారని, భయపడకుండా ఎప్పుడైనా ఫిర్యాదు కోసం స్టేషన్‌కు వచ్చి చెప్పవచ్చని కూడా వివరించారు. పోలీసు విభాగంలోని హైరార్కీ, అధికారుల స్థాయిల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు కార్యక్రమం ద్వారా పోలీసుల పని విధానం, పరికరాల ఉపయోగం తెలుసుకోవడం ఉపయోగకరమని, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.



## స్ట్రీట్ వెండర్లకు డిజిటల్ ఆన్‌బోర్డింగ్ కార్యక్రమం

**రాయికల్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

రాయికల్ పట్టణ కేంద్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్ట్రీట్ వెండర్లకు డిజిటల్ ఆన్‌బోర్డింగ్ కార్యక్రమం నిర్వహించబడింది. పోస్టాఫీస్ సహకారంతో స్ట్రీట్ వెండర్లకు డిజిటల్ లావాదేవీల సౌకర్యం కోసం స్కానర్‌లు పంపిణీ చేయబడ్డాయి. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ ప్రధాన అతిథిగా పాల్గొని, డిజిటల్ పద్ధతులు అవలంబించడం వల్ల వ్యాపారంలో పారదర్శకత పెరుగుతూ ఆర్థిక లావాదేవీలలో సౌకర్యం కూడా కలిగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా టి.ఎం.సి శరణ్య, పోస్టల్ డిపార్ట్మెంట్ అధికారులు కళ్యాణి, ఆర్పీలు, స్థానిక స్ట్రీట్ వెండర్లు పాల్గొన్నారు. అధికారులు తెలిపినట్లు, ఇలాంటి కార్యక్రమాలు పట్టణంలోని చిన్న వ్యాపారులకు డిజిటల్ యుగంలో అడుగుపెట్టే అవకాశాన్ని కల్పిస్తున్నాయని పేర్కొన్నారు.

## మీసేవ సెంటర్లలో అధిక డబ్బులు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు

**చేగుంట, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

మెదక్ జిల్లా, చేగుంట మండలంలో మీసేవ సెంటర్లలో దరఖాస్తుదారుల నుండి అధిక డబ్బులు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ శివ ప్రసాద్ హెచ్చరించారు. మండలం స్థిత అన్ని మీసేవ, ఇంటర్నెట్ సెంటర్ల ప్రతినిధులతో తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి, మీసేవ, ఇంటర్నెట్ ద్వారా భూభారతి, కళ్యాణ లక్ష్మి , ఇతర మీసేవ ధృవపత్రాల కోసం దరఖాస్తు చేసినప్పుడు చెల్లించాల్సిన రుసుము కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేయరాదు అని చెప్పారు. మీసేవ ధృవపత్రాలను దరఖాస్తు చేసిన రెండు రోజులలో సంబంధిత కార్యాలయంలో అందించాల్సిన విధంగా సూచించారు. భూభారతి స్లాట్ బుకింగ్, భూముల వ్యవహారాల్లో ఎవరూ దళారుల లేదా మధ్యవర్తుల ద్వారా పని చేయరాదు అని స్పష్టం చేశారు. వీరికి విరుద్ధంగా ఏ విధమైన చర్యలు చేపడితే, చట్టపరమైన చర్యలు తీసుకుని, సంబంధిత మీసేవ, ఇంటర్నెట్ సెంటర్లపై పై అధికారులకు నివేదిక పంపిస్తామని తాసిల్దార్ శివ ప్రసాద్ హెచ్చరించారు.

## జేసీబీ డ్రైవర్ అదృశ్యం

**చేగుంట, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

మెదక్ జిల్లా, చేగుంట మండలం, పొలం పల్లి గ్రామంలో జేసీబీ డ్రైవర్ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎరుకల ప్రవీణ్ (వయసు 30) 13వ తేదీ రాత్రి సుమారు ఏడు గంటలకు తన ఇంటి నుండి బయటకు వెళ్లి వస్తానని తెలిపి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా అతని ఆచూకీ దొరకలేదని తెలుస్తోంది. భార్య ఎరుకల కావేరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్సై శ్రీ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు. ప్రవీణ్ ఇంటి నుంచి వెళ్లినప్పుడు బ్లాక్ కలర్ టీ షర్ట్, నీలం రంగు జీన్స్ ధరించాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

# మొక్కలు నాటడం భవిష్యత్ కు బహుమతి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

చెట్ల పెంపకం భవిష్యత్ తరాలకు అందించే గొప్ప బహుమతి అని, మొక్కలు నాటి, సంరక్షించుకుని పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి. ధర్మ నాయక్ తెలిపారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సీబీసీ, నిజామాబాద్ క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బి. ధర్మ నాయక్ విద్యార్థులకు భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణంతో కూడిన భూమిని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. పర్యావరణం మరియు ప్రగతిని సమన్వయం చేసుకుని ముందుకు సాగినప్పుడు నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, విద్యార్థులు ఒక్కొక్కరు ఒక మొక్కను నాటి స్ఫూర్తిని విస్తరిస్తే మరింత ప్రభావితం అవుతారని సూచించారు. అలాగే, మొక్క నాటిన తరువాత చాయా చిత్రాలను హ్యాష్ ట్యాగ్‌లతో సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని సూచించారు. గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రామ్ మోహన్ రెడ్డి స్వచ్ఛమైన పర్యావరణాన్ని ముందుయుగాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలసి జీవించడం ద్వారా మాత్రమే మనిషి సుస్థిర జీవితం పొందగలడని, మన పూర్వీకులు అందించిన స్వచ్ఛమైన గాలి, నీరు, నేలను యధావిధిగా భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరి విధి అని స్పష్టం చేశారు. పరిశుభ్రత, పచ్చదనం, ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రతిఒక్కరు పునరంకితం కావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్ డాక్టర్ ఎం. రామస్వామి, సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ అసిస్టెంట్ రసిద్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఘనంగా పోషణ మాసం వేడుకలు



**రాయికల్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

రాయికల్ పట్టణంలోని 3వ, 7వ అంగన్వాడీ సెంటర్లలో పోషణ మాసం వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, ఆరు సంవత్సరాల లోపు పిల్లల తల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మావతి పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. రక్తహీనత ఉన్న గర్భిణీలు విటమిన్–సి సమృద్ధి ఆహార పదార్థాలు నిమ్మ, దానిమ్మ, క్యారెట్, బీట్రూట్, ఆకుకూరలు, మొలకెత్తిన గింజలు, అటుకులు, బెల్లం, ఖర్జూరం, నువ్వులు, పల్లీలు, పుట్నాలు, చిరుధాన్యాలు, పప్పులు తీసుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణలో కిచెన్ గార్డెన్ ద్వారా పండించే ఆకుకూరలు, కూరగాయలను ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. గర్భిణీలు రెండు టిటీలను తప్పనిసరిగా వేయించుకోవాలని, అవసరమైతే 102, 108 సేవలను వినియోగించాలని సూచించారు. రోజుకు కనీసం రెండు గంటల విశ్రాంతి తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచనలు ఇచ్చారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇచ్చితే రోగనిరోధక శక్తి పెరుగుతుందని, రెండు సంవత్సరాల వయస్సు వరకు తల్లిపాలు ఇవ్వాలని, రెండున్నర సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. పిల్లల మేధో, భాషా, సాంస్కృతిక అభివృద్ధికి మట్టి బొమ్మలు, చెక్క బొమ్మలు, పూసలు గుచ్చడం, కాగితాలు చింపడం వంటి సృజనాత్మక ఆటల ప్రాముఖ్యతను వివరించారు. కిశోర బాలికలకు రక్తహీనత నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. సామ్యా పిల్లలకు ప్రతినెల బాలామృతం ప్లేస్ అందించబడుతుందని, ప్రతి నెల 1వ, 15వ తేదీల్లో పిల్లల బరువులు తూకం వేయడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బి. వనిత, ఏ. రజిత, ఏఎన్ఎం విజయలక్ష్మి , జుబేదా ఫాతిమా, ఆశా వర్కర్లు వసంత, విజయలక్ష్మి , తల్లులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుతున్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక–ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర సాంఘిక, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మరియు ఇతర ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల నుంచి కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, సంక్షేమ శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విద్యార్థుల బోధన, ఆరోగ్యం, భోజనం, మౌలిక సదుపాయాలు నిరంతరం పర్యవేక్షించాలని, పాఠశాలలను సందర్శించి సమస్యలు పరిష్కరించమని సూచించారు. ప్రతి ఎంపికైన విద్యార్థి పాఠశాలలో కొనసాగాలని, సమస్యల పరిష్కారంపై పాఠశాల యాజమాన్యంతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి ఉపసంచాలకులు రజిత, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగురావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




## జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్‌లో సోనాల విద్యార్థుల ఘన విజయం

**బోథ్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

ఆదిలాబాద్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో సోనాల ప్రాంతానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచి జోనల్ లెవెల్ టోర్నమెంట్‌కి ఎంపికయ్యారు. ఈ పోటీల్లో తమ ప్రతిభను చాటిన విద్యార్థులు ఎస్. వర్షిత, చె. కవ్య, టి. ఓంకర్, బి. సుమీత్, శివ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, క్రీడా ఉపాధ్యాయులు, యాజమాన్యం ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల మద్దతుతో ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. అంతేకాక, ఇంకా ఉన్నత స్థాయిలో ప్రతిభను చాటుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## మొబైల్ కంటి స్క్రీనింగ్ క్యాంప్

**ఎడపల్లి, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి, లయన్స్ క్లబ్ ఆఫ్ అచ్చన్‌పల్లి ఆధ్వర్యంలో ఎడపల్లి మండలం ఎం ఎస్ సి ఫా రం గ్రామంలో మొబైల్ కంటి స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఇందులో సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేయగా, 15 మందికి మోతె బిందు గుర్తించి వారిని ఉచిత శస్త్రచికిత్స కోసం బోధన్ లయన్ కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. క్యాంప్‌లో డాక్టర్ సతీష్, అచ్చన్‌పల్లి లయన్స్ సభ్యులు చక్రవర్తి, జసి రామకృష్ణ, శ్రీనివాస్ రాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అధ్యక్షురాలు పుష్పలత, సెక్రటరీ మెర్సీ, కోశాధికారి శంకర్, గేట్ కో–ఆర్డినేటర్ సూర్యనారాయణ, హన్మంత్ రావు పాల్గొన్నారు.






## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**మర్కుక్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన బ్యాగారి బాలకృష్ణ (వయసు 58) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ మండల్ బి ఆర్ ఎస్ బి సి సెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ మంగళవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట సోమా వెంకటేష్, దేవరాయ శేఖర్, ముమ్మడి దొడ్డాచారీ, కొట్టాల మహేష్ తదితరులు ఉన్నారు.



## టీపీసీసీ పరిశీలకులుగా జుక్కల్ ఎమ్మెల్యే

**జుక్కల్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం):**

కామారెడ్డి జిల్లా, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి ఎంపిక ప్రక్రియలో భాగంగా మంగళవారం నారాయణ ఖేడ్ నియోజకవర్గ కేంద్రంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు టీపీసీసీ పరిశీలకులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష (డీసీసీ) పదవి ఎంపికకు సంబంధించిన చర్చలో కార్యకర్తల అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ ఎమ్. ఎస్. సజరిత్ లైటఫలాంగ్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, నారాయణ ఖేడ్ శాసన సభ్యులు పట్లోళ్ల సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బౌద్ధమతమే సామాజిక అసమానతలను నిర్మూలించడానికి మార్గం

**గజ్వేల్, అక్టోబర్ 14 (ప్రజా శంఖారావం) :**

డా. బాబాసాహెబ్ అంబేద్కర్ 1956 అక్టోబర్ 14న నాగపూర్‌లోని దీక్షాభూమి వద్ద 5 లక్షల మంది అనుచరులతో బౌద్ధ దీక్ష తీసుకున్న రోజు ధమ్మ చక్ర పరివర్తన దివస్గా జరుపుకుంటారు. దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) ఆధ్వర్యంలో కొమటిబండలో బుద్ధ విగ్రహం వద్ద మంగళవారం డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంలో ఏగొండ స్వామి, బ్యాగరి వేణు మాట్లాడుతూ, బహుజనుల భవిష్యత్తుకు బాసట బౌద్ధమతమేనని స్పష్టం చేశారు. బాబాసాహెబ్ ధమ్మ దీక్ష పూని ఈ రోజు నేటికి 69 సంవత్సరాలు పూర్తయిందని గుర్తుచేశారు. బుద్ధుని ధర్మం, అశోకుని ప్రచారం, డా. బి.ఆర్. అంబేద్కర్ ధర్మ దీక్ష దివస్ సామాజిక అసమానతలను నిర్మూలించడంలో, స్వేచ్ఛ, సమానత్వం మరియు సౌభ్రాతృత్వం తీసుకురావడంలో గొప్ప ప్రయత్నమని తెలిపారు. సామాజిక దురాచారాలను నిర్మూలించడానికి బౌద్ధమతం ఏకైక పరిష్కారమని, బుద్ధుని సందేశం ప్రపంచవ్యాప్తంగా శాంతి, ప్రశాంతతను నిర్ధారించుతుందని తెలిపారు.

